

# గ్రంథాలు

## వి. ప్రతిమ

శరత్ మంచి కలం స్నేహితుడు.

ప్రతిరోజూ క్రమం తప్పకుండా పోస్ట్‌మేన్ మా గదిని సందర్శిస్తున్నాడంటే దానికి ముఖ్యకారణం శరత్ కలం స్నేహమే.

ఉత్తరాలు అందుకోవడంలో శరత్ ఎంత ఉత్సాహాన్ని చూపిస్తాడో తిరిగి వ్రాయడంలోనూ అంతే శ్రద్ధనీ, ఉత్సాహాన్నీ కనబరుస్తాడు.



ఎంత రెగ్యులర్‌గా వ్రాయకపోయినట్లయితే వాడికి రాష్ట్రవ్యాప్తంగా ఇంతమంది కలం స్నేహితులుంటారు. నాకుమాత్రం ఈ కలంస్నేహాలమీద సదభిప్రాయం లేకపోవడంతో వాడి ఉత్తరాలగురించి పెద్దగా పట్టించుకునేవాడినికాదు.

"ఆనంద్ మబ్బులుచూడు ఎంతందంగా వున్నాయో... వర్షం వచ్చేలా వుంది. ప్లీజ్ బయుటికెళ్దాం కాసేపు. సరదాగా" చెప్పాడు శరత్ నా భుజాలమీద చేతులువేసి. తప్పనిసరిగా లేచి వాడితోపాటే బయటికొచ్చాను.

"ఏవిటీ పిచ్చి. వర్షంలో ఇలా బయటికెళ్ళకపోతే హాయిగా రూములో కూర్చోవచ్చుగా" మందలిస్తూ చెప్పాను. నా మాటలేవీ పట్టించుకోలేదు వాడు.

శరత్‌కి స్పందించే హృదయముంది... దానికి వ్రాయాలనే తపనుంది.

అయితే అక్షరరూపం దాల్చడానికి కలమూ, కాగితమూ రెండూ మారాం చేస్తుంటాయి వాడి చేతుల్లో... నల్ల మబ్బుల్నీ, వీస్తున్న చల్లగాలినీ, శిరసొంచి వందనం చేస్తోన్న చెట్లనీ చూస్తూ వాతావరణంలోని హాయిని అనుభూతిస్తున్నాడు శరత్.

శరత్, నేనూ చిన్ననాటి నుండి కలసే చదువుకున్నాం... దైవికంగా ఒకేచోట ఉద్యోగాలురావడంతో కలిసే వుంటున్నాం. వాడిని నేనర్థం చేసుకున్నంత బాగా మరెవరూ అర్థం చేసుకోలేరేమో.

"మా కంపెనీ నన్ను డెప్యుటేషన్‌మీద పంపుతోంది. ఓ రెండు నెలలపాటు నేను ఊళ్ళో వుండను" చెప్పాను శరత్‌తో.

వాడి మొహం కళావిహీనమైపోయింది.

"రెండు నెలలే" అన్నాడు కళ్ళు పెద్దవిచేస్తూ.

"అవును. నువ్వు ఉత్తరాలు, పుస్తకాలు అంటూ మునిగిపోక వేళకి తిండీ, తిప్పలూ సరిగా చూసుకో... ఆఫీసువేళలుకూడా మర్చిపోగలవు" విసుగ్గా మందలిస్తున్నట్లుగా చెప్పాను.

"ఊ" అనాసక్తంగా జవాబిచ్చి "ఇంతకీ ఏవూరు?" అన్నాడు.

"బెంగుళూరు"

ఆ మాట వినగానే చిత్రంగా శరత్ మొహంలోకి ఉత్సాహం తన్నుకొచ్చేసింది... ఆశ్చర్యంగా చూశాను.

"బెంగుళూరా? చాలా దూరంకదూ" అంటూ మళ్ళీ తనే

"ఆనంద్ సింధు అక్కడే వుంది... నువ్వు సింధుని కలుసుకుంటావా ప్లీజ్" అన్నాడు నా చేతులు పట్టి వూపేస్తూ.

"సింధు" శరత్‌కి కలం స్నేహితురాలు.

శరత్‌కి కలం స్నేహితులు చాలామందే వున్నా ఈ 'సింధు' అంటే శరత్‌కి ప్రత్యేకమైన అభిమానం.

ఆమెవద్దనుండి ఉత్తరమొస్తే ఆరోజుకిక భూమ్మీద నడవడు. గాలిలో మాత్రమే తేలుతుంటాడు. "సింధు నీకెలా పరిచయం" కుతూహలంగా ప్రశ్నించాను.

రెండుమూడుసార్లు సింధు ఉత్తరాల్ని శరత్ బలవంతంతో చూసినా ఆమె ఎవరు? ఎలా పరిచయమైందీ అంటూ నేనెన్నడూ

తరచి తెలుసుకోలేదు. బెంగుళూరులో సింధుని కలవమని శరత్ కోరాక ఆమెని గురించి తెలుసుకోవాలనిపించింది.

"సంవత్సరం క్రితం మనం కాఫీకి వెళ్ళినపుడు ఆ కాకాహోటల్లో శిథిలమైన ఆ పాత పత్రికలో నేనో కవిత చూశాను. ఆ కవిత ఎంత చక్కగా వుందంటే చక్కని పదాల కలయికతో మధురమైన భావాన్ని స్ఫురింపజేస్తూ సూటిగా నా మనసుని తాకింది" పరవశంగా చెప్తున్నాడు శరత్.

వాడికున్న సాహిత్యాభిలాష నాకు తెలీందేమీకాదు. సాహితీ స్నేహాలు చేసి వాడికున్న వ్రాయాలనే తపనని ఇలా తీర్చుకుంటూ వుంటాడు.

"ఆ ఛ్రదను చూసి నేను వ్రాసిన తొలి ఉత్తరానికే ఆమె స్పందించడం నిజంగా నా అదృష్టం"... "సింధు వుత్తరాలు ఎంత బాగా వ్రాస్తుందో తెలుసా?"

"అవును చూపెట్టావుగా"

నిజమే సింధు ఉత్తరాలు ఒకటిరెండు శరత్ నాకు చూపించాడు.


నీలం ముఖమల్ గుడ్డమీద మంచి ముత్యాలు వరుసలుగా పేర్చినట్లు లేత నీలిరంగు కాగితంపై సింధు అక్షరాలు పెరేడ్‌లోని సైనికుల్లా బారులు తీర్చి వుంటాయి. అక్షరమక్షరమూ గొప్ప భావపూరితంగా వుండి స్నేహాత్మీయతల్ని మోసుకువస్తాయి.

"ఆనంద్ నువ్వు తప్పకుండా సింధుని కలువు. సింధు నిన్ను నా స్నేహితుడిగా తప్పక గౌరవిస్తుంది"

వాడిగోల భరించడం కష్టమౌతోంది.

నేను కలుస్తాననిగానీ, కలవననిగానీ ఏమీ చెప్పలేదు. మౌనంగా వుండిపోయాను... ఇంతలో చినుకు చినుకుగా భూమాతను స్పృశిస్తోన్న ఆకాశం వెండిదారలుగా మారి భూమితో ఐక్యం కావాలని ప్రయత్నించసాగింది.

ఇద్దరం కలిసి అలా హోటల్‌కి వెళ్ళి భోజనం ముగించి రూముకొచ్చి పడ్డాం.



శరత్ సింధుతో తన పరిచయాన్ని గురించి చాలా పొద్దుపోయేంతవరకూ కథలుకథలుగా చెప్తూనే వున్నాడు... అనాసక్తంగా మంచం మీది కొరిగాను నేను.

* * *

నేను వెళ్ళాల్సినరోజు రానేవచ్చింది.

ట్రెయిన్ కదిలేంతవరకూ సింధుని కలవమని చెప్తూనే వున్నాడు శరత్.

విని విని చెవులు హోరెత్తిపోగా చూసి చూసీ చెప్పాను.

"చూడు శరత్ ఆ అమ్మాయి ఎలాంటిదో తెలీదు. వాళ్ళింట్లో ఎవరెవరుంటారో అసలే తెలీదు. ఇలా నేను డైరెక్ట్‌గా వెళ్ళిపోవడంమూలంగా ఆమె ఎలాంటి ఇబ్బందుల్ని ఎదుర్కోవలసి వస్తుందో తెలీదు. నీకంతగా ఆసక్తి వుంటే ఓసారి బెంగుళూరు రావచ్చుకదా"

"సింధు ఉత్తరాలనిబట్టి అమ్మాయి చాలా మంచిదిరా. నువ్వెళితే తప్పకుండా ఆదరిస్తుంది"

శరత్ అర్తుత అమ్మాయిని కలవమని నన్ను పదేపదే కోరడం ఇదంతా చూస్తుంటే వాడు సింధుని ప్రేమిస్తున్నాడేమో అనిపించింది.

కానీ ఆమాట అడగడానికి మొహమాట పడ్డాను.

"తెలీదు. ఇంతవరకూ మేము ఉత్తరాల్లో వ్యక్తిగత విషయాలు మాట్లాడుకోలేదు... సాహితీ చర్చలూ, కవితల గురించి కబుర్లూ శ్రీశ్రీ గురించో, కృష్ణశాస్త్రి గురించో వ్రాసుకోవడమే తప్ప మీరేమిటి? అంటూ నేనెన్నడూ ప్రశ్నించలేదు" అమాయకంగా చెప్పాడు.

"చాలా గొప్ప పనిచేశావ్" అనుకున్నాను మనసులో.

పైకిమాత్రం

"వ్యక్తిగత పరిచయం ఏమాత్రం లేకుండా మీ సాహితీ మిత్రుడికి స్నేహితుణ్ణి అంటూ వెళ్ళి నన్ను నేను పరిచయం చేసుకోవడం ఏం బావుంటుంది చెప్పు? వెళ్ళి ఏం మాట్లాడను?" వివరిసారిగా చెప్పిచూశాను.

"ప్చ్ ఆనంద్ నువ్వు సింధుని కలుస్తున్నావు" అన్నాడు వాడు విసుగ్గా.

* * *

నేను బెంగుళూరు వెళ్ళి కంపెనీలో జాయినయి రెసిడెన్స్ అదీ చూసుకుని సెటిలవడానికి వారం రోజులు పైనే పట్టింది

పది రోజుల తర్వాత శరత్ ఉత్తరం వచ్చింది.

"సింధుని కలిశావా? ఏమిటి విశేషాలు అంటూ" అప్పటిదాకా సింధుని కలుసుకోవాలన్న విషయమే నాకు జ్ఞాపకం లేకపోవడం నిజంగా శోచనీయం.

ఆ ఆదివారం వీలుచూసుకుని శరత్‌ని గురించి సింధుని చూడడానికి వెళ్ళాను.

సిటీబస్‌లో కూర్చున్న తరువాత తొలిసారి సింధుని గురించి ఆలోచించడం మొదలు పెట్టాను.

"సింధు" ఎంత చక్కటిపేరు... ఆ

అమ్మాయి ఎలా వుండి వుంటుంది.

చాలారోజుల క్రితం తనో కథ చదివాడు.

ఫోన్లో నాజూకైన ఆ గొంతువిని ఆ అమ్మాయిని ప్రేమిస్తాడు హీరో. ఆ ప్రేమ గాఢంగా ముదిరి పెళ్ళికి దారితీశాక తీరా వెళ్ళిచూస్తే ఆ అమ్మాయి అనాకారి. అలాంటి వికృతరూపానికి అంతటి మధురమైన స్వరాన్నిచ్చిన ఆ భగవంతుణ్ణే శపిస్తూ తన ప్రేమలోని నిజాయితీని లోకానికి తెలియబరచడం కోసం తప్పనిసరిగా పెళ్ళాడతాడు హీరో.

మరో కథలో స్వప్న అనే ఓ అమ్మాయి ఓ రచయితకి అద్భుతంగా ఉత్తరాలు వ్రాస్తూంటుంది. ఈ సదరు రచయిత ఆ ఉత్తరాలతో మెస్మరైజ్ చేయబడి ఆ అమ్మాయిని చూద్దామని వెళ్తే ఆవిడ పదహారేళ్ళ స్వప్నకాదు. అరువది వసంతాల ముదిత అని తేల్తుంది... దాంతో రచయిత విఠలాచార్య సినిమాలోలా మాయమైపోతాడు.

నేను వెళ్ళేసరికి ఓ ముసలావిడ కర్రపట్టుకుని వణుకుతూ వచ్చి 'నేనే సింధుని' అంటే ఎలా వుంటుంది... ఇది చెప్తే శరత్ ఫీలింగ్స్ ఎలా వుంటాయి అంటూ ఆలోచిస్తూ వుంటే తెరలుతెరలుగా చెప్పలేనంత నవ్వొచ్చింది నాకు.

"సింధు ఎలా వుంటుంది? నన్నెలా రిసీవ్ చేసుకుంటుంది" ఆ అడ్రస్ వెతుక్కుని ఇంటికి వెళ్ళేక్షణంవరకూ టెన్షన్ ఫీలవుతూనే వున్నాను.

వెళ్ళి బెల్ నొక్కి తలుపులు తెరుచుకోవడంకోసం చూస్తున్నాను.

బొద్దుగా, తెల్లగా వున్న పదేళ్ళ కుర్రాడు తలుపు తెరిచాడు.

"సింధుగారిల్లు ఇదేనా?"

"అవును మీరెవరు?"

"సింధుగారున్నారా?" జవాబు చెప్పకుండా అడిగాను.

"ఉన్నారు. రండి కూర్చోండి"

లోపలికి నడిచాను.

"మమ్మీ. ఇట్స్ ఫర్ యూ" అంటూ ఆ అబ్బాయి లోపలికి కేకపెట్టి ఇటు బెడ్ రూమ్ లోనికి కాబోలు వెళ్ళిపోయాడు.

ఇంత కొడుకున్నాడంటే సింధుకి ముప్పై



## అనుమానం

పార్కులో సుశీల రాజుతో అంది "రాజా! మనం ఇక ప్రేమించడం ఆపి పెళ్ళి చేసుకుంటే బావుంటుందేమో?"

"నేనూ అదే ఆలోచనలో వున్నాను డార్లింగ్! కాని ఈ వయసులో మనకు సంబంధాలు దొరుకుతాయంటావా?" ఠక్కున అన్నాడు రాజు!

—ఎం.చంద్రప్రకాశరావు (కొండాపూర్)

అయిదు వసంతాలుండొచ్చు. లోపల్నుండి రాబోయే వ్యక్తినిగురించి అంచనా వేస్తూ నేను కూర్చున్న ఆ గదిని పరిశీలిస్తున్నాను.

అయితే

"నమస్తే నేను సింధు... మీరూ?..." అంటూ డౌట్‌ఫుల్‌గా చూస్తూ వచ్చి నా ఎదురుగా కూర్చున్న ఆ అమ్మాయికి పూర్తిగా ఇరవై వసంతాలకు మించి వుండవు.

తెల్లటి, నున్నటి శరీరంమీద మెరిసిపోతూ, జారిపోతున్న సిల్కుచీర, మెడలో నల్లపూసలు, కాళ్ళకి మెట్టెలూ శిల్పం జీవంతో కదలి వచ్చినట్టుగా వుంది.

ఆ అద్భుత సౌందర్యాన్ని వీక్షిస్తూ నన్ను నేను పరిచయం చేసుకున్నాను.

శరత్ గురించి చెప్పగావే ఆమె కళ్ళలో వెలుగులు.

శరత్ స్నేహితుడుగా ఆమె నన్నెంతో ఆదరించింది.

"శరత్ రాలేదా?" అంటూ నన్ను ప్రశ్నించింది.

"లేదండీ. నేనిక్కడ డెప్యుటేషన్ మీదొచ్చాను"

శరత్ మంచి సాహితీ మిత్రుడు. ఎన్నో మంచి మంచి సజీవ రచనలగురంచి బాగా చర్చించగలడు. అతడి ఉత్తరాలుకూడా ఆత్మీయంగా వుంటాయి" అంటూ ప్రశంసించింది.

చిత్రమేమిటంటే అప్పుడుకూడా ఆమె

"శరత్ ఏం చేస్తుంటాడు? పెళ్ళయిందా? పిల్లలున్నారా?" అంటూ వ్యక్తిగత విషయాల్ని ప్రస్తావించలేదు. ఆమె సంస్కారానికి ముగ్ధుణ్ణయ్యాను.

ఆ కొద్ది పరిచయంలోనే ఆమెను గురించి నేను తెలుసుకున్నదేమిటంటే ఆమె భర్త పేరుమోసిన డాక్టర్. ఆమె బ్యాంక్‌లో ప్రొబెషనరీ ఆఫీసర్‌గా పనిచేస్తోంది. ఒక్కడే కొడుకు అనూప్.

అంత బ్యాలెన్స్‌డ్‌గా శరీరాన్ని మెయింటెయిన్ చేస్తోన్న ఆమెను చూసి నిజంగా మెచ్చుకోకుండా వుండలేకపోయాను.

వెంటనే సింధు విశేషాలతో శరత్‌కి ఉత్తరం వ్రాశాను. అయితే సింధుకి పెళ్ళయిందన్న విషయం మాత్రం ఎందుకో వ్రాయాలన్పించలేదు. వెళ్ళి కలిసినపుడు చెప్దాంలెమ్మని ఊరుకున్నాను.

నా వర్క్ పూర్తయి నేను తిరిగి వెళ్ళిపోయేముందు మళ్ళీ ఓసారి సింధు వద్దకి వెళ్ళాను చెప్పి వెళ్దామని.

"రండి... రండి ఎలా వున్నారు? మళ్ళీ కన్పించనే లేదు" అంటూ చనువుగా ఆహ్వానించిందామె.

ఈసారి ఎక్కువసేపే వున్నాను.

ఆమె తన లైబ్రరీ గదిలోకి తీసుకెళ్ళింది

విశాలమైన ఆ గది. గదినిండుగా చుట్టూ ఉన్న అలమర్లలో ఓ పద్ధతి ప్రకారం నిండుగా పేర్చబడిన పుస్తకాలు... ఆ గదంతా సాహితీ సువాసనలు వెదజల్లుతున్నట్లుగా వుంది. అన్ని వందల పుస్తకాల నడుమ వాటన్నింటినీ ఆసక్తిగా కలెక్ట్ చేసిన సింధు..

ఆ దృశ్యం ఎంతో మనోహరంగా వుంది.

సాహిత్యంమీద ఏమాత్రం అభిరుచిలేని నాకే ఈ పుస్తకాలన్నింటినీ చూస్తుంటే ఒళ్ళు పులకిస్తోంది. శరత్‌లాంటి వాళ్ళు ఈ గదినీ, సింధునీ చూస్తే ఎంత ముగ్ధులైపోతారో కదా అన్పించిందోక్షణం. అమాటే చెప్పానామెకి.

''ఈ పుస్తకాలన్నీ ఎంతకాలంనుండి సేకరించారు? ఇవన్నీ ఎప్పుడు చదువుతారు?'' ఆశ్చర్యంగా ప్రశ్నించాను.

''అన్నీ దాదాపుగా నేను చదివినవే ఆనంద్''

''అందుకే మీరింత సంస్కారవంతులు'' మనసులోనే అభినందించాను. ఆ పుస్తక స్పర్శలో తన్మయత్వం చెందుతున్నట్లుగా వుంది సింధు.

''ఎలాగూ చదివేశారుగా. ఎందుకివన్నీ'' వింతగా వుంది ఇదంతా నాకు.


''అదేవిటానంద్. ఎన్నిసార్లు చదివితే మాత్రం తనివితీరుతుంది. పైపెచ్చు ఇప్పుడు బాధ్యతల్తో నాకు తీరిక తక్కువగా వుంటోంది. ఎక్కడో గొంతులోకి అంతర్లీనంగా బాధతో కూడిన జీర... తీరిక లేనందుకు కాబోలు.

''ఆనంద్...

చీమలు వర్షాలకోసం తిండిని దాచి వుంచుకుంటాయి. మనిషి తన ముసలితనం కోసం వయసులో వున్నప్పుడే సంపాదించి దాచి వుంచుకుంటాడు.

భగవంతుడి దయవలన నాకు తిండికి కొరతేమీ లేదు. నేను నా వృద్ధాప్యం కోసం దాచి వుంచుకున్న ఆస్తి ఈ పుస్తక సంపద... వృద్ధాప్యంలో సహజంగానే పిల్లలు మనల్ని నిర్లక్ష్యం చేస్తారు. ఎవరికీ మనతో మాట్లాడే తీరికుండదు... మన ప్రతీమాట, ప్రతి చర్యా వాళ్ళకి విసుగు కలిగిస్తూ వుంటుంది.

పొరపాటున ప్రేమతో ఎవరినైనా పలకరించామా వాళ్ళ పని హడావిడిలో వాళ్ళు మనమీద చిరాకు పడ్తారు... విదిలించేస్తారు. ఇది సహజ పరిణామం''




## నో ఇండియా!

భారత ప్రభుత్వం ఈ సంవత్సరాన్ని 'టూరిస్ట్ ఇయర్'గా ప్రకటించినా... దేశంలో నెలకొని వున్న పరిస్థితుల దృష్ట్యా విదేశీయులు పెద్దగా ఆసక్తి చూపించటంలేదు. అంతేకాదు! అమెరికా, జపాన, జర్మనీ, బ్రిటన్ వంటి దేశాలు జనవరిలో తమ ప్రజల్ని సాధ్యమైనంతవరకు ఇండియా విహారయాత్రలకు వెళ్ళవద్దని హెచ్చరించాయి. అప్పటికే ఇండియాలో ఉన్నవారిని వెంటనే తిరిగి ప్రయాణం అవ్వాలని కూడా కోరాయి! దురదృష్టవశాత్తూ విదేశీయులకు ఆసక్తిని కల్పించే పట్టణాలన్నింటినీ... వారు 'డిస్టర్బ్‌డ్' సిటీస్‌గా గుర్తించారు! చూశారా మరి! మతసంబంధమైన గొడవలవల్ల మన దేశం ఎంత విదేశీమారక ద్రవ్యాన్ని కోల్పోతోందో!

—జూపిటర్

నిజమే వృద్ధాప్యాన్ని గురించి ఎంతో బాగాలోతుగా ఆలోచించగలిగిందీమె... దిగ్భ్రాంతి చెందుతూ సింధు చెప్పేది శ్రద్ధగా వింటున్నాను నేను.

"నా ముసలితనంలో ఈ పుస్తకాలు నాతో స్నేహం చేస్తాయి.

నేను ఎవరినీ ఆత్మీయంగా నాతో రెండు మాటలు మాట్లాడామని ప్రాధేయపడనవసరంలేదు... పుస్తక స్పర్శనాకు గొప్ప ఆనందాన్నిస్తుంది. ఆ రోజున నేను ఒంటరితనాన్ని అనుభవించాల్సిన అవసరంలేదు.

అవును ఆనంద్...

పుస్తకాలు నా ప్రాణ సమానాలు.

మంచి పుస్తకం చదువుతుంటే పచ్చపచ్చని పంటపొలాలలో తిరుగాడుతున్నట్లుగా... ఆకాశంలోని మేఘాలతో కలసి హాయిగా నర్తిస్తున్నట్టుగా... కోయిల నా చెవిలో పాడుతున్నట్లుగా... తుంపర తుంపర జల్లులలో తడిసినట్లుగా గొప్ప అనుభూతి

నా ఈ సాహిత్యాభిలాష చివరివరకూ నన్ను వెన్నంటే వుంటుందని నా ప్రగాఢ విశ్వాసం... ఎప్పుడూ కొత్త కొత్త పుస్తకాలకోసం, మంచి మంచి కవిశ్రేష్ఠులకోసం అన్వేషిస్తూనే వుంటాను. అవును ఆనంద్ పుస్తకాలు నా ప్రాణ సమానాలు"

మాట్లాడ్డం ఆపేసిన సింధు కళ్ళల్లో రెండు కన్నీటిబొట్లు ముత్యాల్లా మెరుస్తున్నాయి.

చేష్టలుడిగి సింధు వైపు ఆరాధనగా చూస్తుండిపోయాను.

పుస్తకాలు చదివేవాళ్ళను చాలామందినే చూశాను. కానీ మరీ ఇంతలా లీనమైపోయి, తన్మయత్వం చెంది పుస్తకాలకోసమే జీవించే వాళ్ళను నేనింతవరకూ ఎక్కడా చూలేదు.

నాకు తెలీకుండానే దగ్గరగా వెళ్ళి ఆమె రెండుచేతులూ పట్టుకున్నాను.

"సింధూ... అయ్ లైక్ యూ... ఐ అడోర్ యూ" ఈ మాటలు ఓ విధమైన ట్రాన్స్‌లో నాకు తెలీకుండా పలికినట్లున్నాను.

"ఆనంద్... కూర్చోండి... పుస్తకాల మధ్యలో వుంటే నాకు ఒళ్ళే తెలీదు సుమా... ఏదేదో చాలా మాట్లాడి విసిగించానేమోకదూ అంటూ నవ్వింది సింధు మృదువుగా తన చేతులు విడిపించుకుంటూ

ఉలిక్కిపడి తేరుకుని దూరంగా జరిగాను.

* * *

అక్కడినుండి వచ్చాకకూడా చాలారోజులు సింధు తాలూకు ఆలోచనలు పరిమళంలా నన్ను వెన్నంటే వుండేవి.

శరత్, సింధు మామూలుగా ఉత్తరాలు వ్రాసుకుంటున్నారు... అందులో అప్పుడప్పుడూ నన్నుగురించిన కబుర్లుకూడా వుంటుండేవి. ఇప్పుడు నాకు శరత్ కలంస్నేహం మీద చిన్నచూపు లేకపోగా ఓ విధమైన గౌరవభావం ఏర్పడింది.... అప్పుడప్పుడు కనులముందు సింధురూపం కదలాడుతుండేది.

కేలండర్ చెట్టు ఒక్కొక్క ఆకే నేల

రాలుస్తూ గ్రీష్మంతో దోబూచులాడుతోంది. ఆ వేసవిలో శరత్‌కి పెళ్ళయింది. శరత్ ఇన్విటేషన్ కార్డు ఇచ్చినపుడు...

"శరత్ నిన్నో మాటడుగుతాను ఏమీ అనుకోవుగా?" సంకోచిస్తూ ప్రశ్నించాను.

వింతగా చూశాడు వాడు నావైపు.

"నీకు నా దగ్గర ఆలోచనేమిట్రా? అడుగు ఆనంద్... అలా సంకోచిస్తావేంటి"

"మరేం లేదు నువ్వు... నువ్వు సింధుని ప్రేమించలేదా?"

నవ్వాడు శరత్

తెరలు తెరలుగా వుందా నవ్వు.

ఓ అమాయకుణ్ణి చూసి మహామేధావి జాలిపడ్తున్నట్లుగా వుందా నవ్వు.


సిగ్గుపడ్డాను నేను... నాకీ ప్రేమ గొడవలేమీ తెలీవు... ఇలా అడిగి వుండాల్సింది కాదేమో వాడిని.

"ఆనంద్ సింధుని నేను... నేను ప్రేమించడమా?"

"సింధు ఓ దేవతరా... దేవతని ఆరాధిస్తారు... అభిమానిస్తారు. ప్రేమిస్తారు నిజమే. కానీ పెళ్ళాడి నా ఇంట్లో నాకు బానిసని చేసుకుంటానా? నా ఇంట్లో నాకు వంట చేసి పెట్టమనో, నాకు పిల్లల్ని కనమనో, నాకు కాళ్ళు పిసకమనో అడుగుతానా చెప్పు... మా స్నేహం ఈ మామూలు ఆకర్షణలకు అతీతమైంది... సింధులాంటి దేవతని అంత తక్కువగా ఎలా అంచనా వేశావురా" అన్నాడు వాడు.

ఇక్కడ నేను తక్కువగా అంచనా వేసింది సింధుని కాదు శరత్‌ని అన్పించింది నాకో క్షణం. నేను అమాయకుడని తీసిపారేసే ఈ శరత్ నాకళ్ళముందే ఎంతో ఎత్తుకు ఎదిగిపోయినట్లుగా అన్పించింది.

సింధుని వాడు కావాలనుకోలేదు అని తెలీగానే నా గుండెల మీద నుండి పెద్ద భారం తొలగిపోయినట్లుంది నాకు. సింధుకి ఇన్విటేషన్తోపాటు పెళ్ళికి తప్పకుండా రమ్మనమని ఉత్తరం కూడా వ్రాశాడు శరత్



ప్రత్యేకంగా.

అయితే సెలవు దొరక్క సింధు శరత్ పెళ్ళికి రాలేకపోయింది.

శుభాకాంక్షలు మాత్రం పంపినట్టుంది ఆత్మీయంగా.

* * *

కాలచక్రం గిర్రున పదిసార్లు తిరిగిపోయింది.

ఈ మధ్యకాలంలో చెప్పుకోదగ్గ మార్పులేమీ లేవు... నేనూ, శరత్ పెళ్ళిళ్ళు చేసుకుని స్థిరపడ్డం తప్ప.

చాలారోజుల తర్వాత ఆ సాయంత్రం శరత్‌ని కలిశాను వాడి అభ్యర్థనతో.

''ఏంటీ అంత హడావిడిగా ఫోను చేశావు త్వరగా కలవమని? ఏమైంది?''

వింతగా వాడినే చూస్తూ ప్రశ్నించాను.

శరత్ కళ్ళనీళ్ళు పెట్టుకుంటున్నాడు... మూభావంగా అస్సలు మాట్లాడలేకపోతున్నాడు... ఇలా చెప్పడం కంటే శరత్ పెద్దపెట్టున ఏడ్చేశాడు అనడం సబబేమో.

''శరత్ ఏవిట్రా ఇది ఆడపిల్లలా?'' మందలించాను.

మామూలుగా అయితే ''ఏం ఆడవాళ్ళు తప్ప మగవాళ్ళు ఏడవటానికి అనర్హులా. వాళ్ళకి ఫీలింగ్స్ ఉండవా ఏవిటి? ఎందుకిలా ప్రతీదానికి ఆడా, మగా అంటూ విభజించి మాట్లాడుతారు'' అంటూ నాతో పోట్లాడేవాడే.

అయితే ప్రస్తుతం వాడి మూడ్ వేరేగా వుంది. నా మాటల్లో తప్పులు పట్టే స్థితిలో లేడు.

''శరత్ ఏమైందో చెప్పవూ?'' బుజ్జగిస్తూ అడిగాను.

''ఆనంద్... సింధు... సింధు...'' అంటూ ఆపై చెప్పలేకపోతున్నాడు.

''సింధుకేమైంది?'' ఆదుర్దాగా అడిగాను.

జేబులోనుండి ఉత్తరం తీసి నా చేతికిచ్చాడు.

ఆ ఉత్తరం సింధు వ్రాసిందిలా లేదు. మరెవరితోనో వ్రాయించినట్లుంది అస్తవ్యస్తంగా చదువురాని చిన్న పిల్లలు వ్రాసినట్లుగా వుంది.

ప్రియమైన శరత్,

ఎలా వున్నావు?

గత సంవత్సరం నుండీ నీ ఉత్తరాలకు నేను జవాబు వ్రాయడం లేదు. నాకు తెలుసు నీవు ఎంతగానో ఎదురుచూస్తూ వుండివుంటావు.

శరత్... నేను నా వృద్ధాప్యం గురించి ముందే ఆలోచించి ఆ వృద్ధాప్యం కోసం ఎనలేని సాహితీ సంపదని దాచివుంచుకొన్నానని ఎన్నోసార్లు అభినందిస్తూ వ్రాసేవాడివి. ఒక్కసారి నా పుస్తకాలయాన్ని దర్శించాలని ఉంది అంటూ అభిలషిస్తూ వ్రాసేవాడివి... కానీ శరత్ ఆ వృద్ధాప్యంలో అనారోగ్యం అంటూ ఒకటుంటుందనే విషయాన్ని నేను మర్చేపోయాను.

నాకేమైందో నాకు తెలీదు కానీ క్రమంగా చూపు మందగించింది. సంవత్సరంనుండీ నీకీ విషయం తెలియజేద్దామన్పించినా

ఎప్పటికప్పుడు నా చూపు మెరుగవుతుందనీ , నీకు మనసారా పెద్ద ఉత్తరం వ్రాద్దామనీ అనుకునేదాన్ని. ఇక నాకు చూపొస్తుందనే ఆశలేదు.

నాకా భగవంతుడు ఆయుష్షు నివ్వకపో యినా కనీసం చివరి క్షణం దాకా చూపునిచ్చి ఉన్నట్లయితే బావుండేదేమో. నా ఈ పుస్తకాలన్నింటినీ ఒక్కసారి తనివితీరా చూసుకునే అవకాశాన్ని కూడా లేకుండా చేశాడు

వృద్ధాప్యంలో ఒంటరితనాన్ని అనుభవించాల్సి వస్తుందేమోనని తోడుగా నేనిన్ని పుస్తకాలని సేకరించి ఉంచుకుంటే వృద్ధాప్యం సంగతెలావున్నా అస్సలు చూపే లేకుండా పోయింది శరత్.

...ఇక నువ్వు రిప్లయి వ్రాయకు. వ్రాసినా నేను చదవలేను.

"శరత్ నా ప్రియ నేస్తం
ఇప్పుడిప్పుడే తెలుస్తోంది నాకోనిజం
ఈ ప్రపంచంలో మరణమొక్కటే శాశ్వతం"

జీవితం నీకు పరిపూర్ణమైన ఆరోగ్యాన్ని ప్రసాదించాలని మనసారా కోరుకుంటూ

స్నేహాత్మీయతలతో
"సింధు"

మొత్తంమీద ఆ ఉత్తరంలోని సారాంశమది. చదవడం చాలానే ఇబ్బందైంది.

ఉత్తరం పూర్తిగా చదివాక శరత్ కళ్ళనీళ్ళు పెట్టడంలో ఆశ్చర్యం కనిపించలేదు నాకు...

గుండె గొంతులోకొచ్చేసినట్లుగా, మనసనే శిరీష పుష్పాన్ని ఎవరో కాలితో కర్కశంగా నలిపివేస్తున్నట్లుగా, గుండెలమీద ఏదో పెద్ద భారాన్ని మోపినట్లుగా అసహనంగా ఫీలవసాగాను.

"సింధు"... పెద్ద పెద్ద గుండ్రటి కళ్ళు.

మనసులోని భావాల్ని అద్భుతంగా పలికించగల ఆ విశాల నేత్రాలు ఇప్పటికీ నాకు బాగా గుర్తు. తన లైబ్రరీని నాకు చూపిన రోజున తన్మయమై, లీనమై మాట్లాడిన సింధు... కనుకొలకుల్లోని ఆ ముత్యాలూ... ఇప్పుడే... ఇప్పుడే చూసినట్లుగా కళ్ళకు కట్టినట్లు కనిపిస్తోంది.



# పెద్ద

సోషల్ పాఠం చెబుతూ మాష్టారు అడిగారు గోపీని—

"ఊళ్ళో పెద్ద మనుషులు ఎవరో చెప్పరా?"

"గ్రామానికి మా నాన్న పెద్ద! మా నాన్నకు మా అమ్మ పెద్దసార్!" ఠక్కున చెప్పాడు గోపి.

—నల్లగట్ల సీతారత్నం (దమ్మపేట)

"సింధు... సింధు" ఇంత చిన్న వయసులోనే చూపు తగ్గిపోవడమూ ఏ కారణమూ లేకుండా... ఏమైందసలు సింధుకి"

మంచివాళ్లని భగవంతుడు సెర్చిలైటు వేసి వెతికి మరీ హింసిస్తాడా?

"సింధూ" అంటూ బాధని దిగమ్రింగుకుంటున్నాడు శరత్.

నాకు తెలుస్తోంది వాడి పరిస్థితి.

ఒక్కసారి చూసినందుకే సింధుమీద తను ఇంతటి అభిమానాన్ని పెంచుకున్నాడే... పన్నెండు సంవత్సరాల నుండీ క్రమం తప్పకుండా ఉత్తరాలు వ్రాసుకుంటూ ఒకరి నొకరు ఆరాధించుకుంటూ, స్నేహాత్మీయతల్ని పెంచుకున్న వాళ్ళిద్దరూ పరస్పరం ఎంత అభిమానాన్ని కలిగివుండాలి.

"శరత్ ప్లీజ్ బాధపడకు" నా గొంతు నాకే పేలవంగా విన్పిస్తోంది.

ఎర్రగా నిప్పు ముద్దల్లా వున్న కళ్ళని పైకెత్తి

"ఆనంద్ ప్లీజ్ ఒక్కసారి నాకు సింధుని చూడాలని వుంది. నాకు సింధుని చూపించవూ ప్లీజ్..." ప్రాధేయపడుతున్నట్లుగా ఉన్న వాడి ధోరణి నాకు కదుపులో దేవినట్లయింది.

"తప్పకుండా చూద్దాం... దూరం కదూ... ఇప్పటికిప్పుడంటే మాటలా? వీలు చూసుకుని సెలవుపెట్టి వెళ్దాం."

సింధు వద్దకు వెళ్దాం అంటూ పదే పదే నచ్చజెప్పిన తర్వాత కానీ వాడు ఇంటికి వెళ్ళలేదు.

ఆ తర్వాత వారం రోజులకి రిజర్వేషన్ దొరికింది... ఈలోపుగా ఏడు రోజుల్నీ ఏడు యుగాలుగా గడిపాడు... ఇక్కడ శరత్ భార్యని గురించి కొంచెం చెప్పాల్సివుంది. ఆమెకు శరత్ సాహిత్యాభిలాషన్నా, ఈ కలం స్నేహాలన్నా బాగా చిన్నచూపు. ముఖ్యంగా సింధు అంటే ఆమెకు సరిపడదు ... సింధుని శరత్ ఆరాధించే విధానాన్ని ఆమె సరైన కోణంలో అర్థంచేసుకోలేకపోయింది... ఈ విషయాలన్నీ శరత్ అప్పుడప్పుడూ నాతో చెప్పి బాధపడుతూ ఉండేవాడు.

నా అభిప్రాయం కరెక్టయితే ఇప్పుడుకూడా శరత్ బెంగుళూరు వెళ్తున్నట్లుగా ఆమెకి చెప్పివుండడు. ఇలా ఆలోచిస్తుండగా—

"ఆనంద్ ఇన్నాళ్ళుగా నేను ఎన్నడూ సింధుని చూడాలనుకోలేదు. ఆమె బావుండగా ఎందుకు నేను చూడలేకపోయానా అన్న బాధ నన్ను పట్టి పీడిస్తోంది... అనవసరంగా విద్యని బాధపెట్టడమెందుకని ఎన్నోసార్లు వెళ్లాలన్పించినా నేను వెళ్ళలేకపోయాను" వెక్కుతూ చెప్పాడు శరత్.

ఆ సాయంత్రం ఆరు గంటలకు బెంగుళూరు చేరుకున్నాం.

ఇంత సుదీర్ఘమైన ప్రయాణంలో కూడా మేమిద్దరం ఒకరితో ఒకరు మాట్లాడుకున్నది చాలా తక్కువ... నాకు శరత్‌ని పలకరించడానికే భయంగా వుంది...

సింధు ఇంటికి ఆటో మాట్లాడుకుని వెళ్ళేసరికి ఆరున్నరయింది.

మేము వెళ్ళేసరికి ఒకళ్ళిద్దరు ఆడవాళ్ళు తప్ప మరెవరూ లేరు ముంగిట్లో.

తుపాను ముందరి నిశ్శబ్దం. నా వెన్నులో నుండి ఏదో జరజరా ప్రాకిన భావన...

తడబడుతూ వెళ్ళి సింధుని గురించడిగాను ఒక పెద్దావిడని.

ఆవిడ పెద్దపెట్టున ఏడ్చేసింది జవాబు చెప్పకుండా. ఆ తర్వాత తెల్సింది. ఆవిడే సింధు తల్లట.

''సింధుకి నూరేళ్ళూ నిండిపోయాయి బాబూ... ఇప్పుడే శ్మశానానికి తీసుకెళ్ళారు'' ప్రక్కనున్నావిడ చెప్పింది వచ్చీరాని తెలుగులో.

అప్పుడు గమనించాను.

ముంగిట్లో నీళ్ళూ, పూలూ, పసుపూ, కుంకుమా

శరత్ కుప్పకూలిపోయాడు.

వెంటనే శరత్‌ని లేపి అదే ఆటోలో ఇద్దరం కలిసి శ్మశానానికి పరిగెత్తాము.

మేము వెళ్ళేటప్పటికి శవదహనానికి ఉపక్రమించబోతున్నారు.

కళ్ళకు నీళ్ళు అడ్డుపడి సింధుని సరిగ్గా చూడనివ్వడం లేదు. నాడు నేను చూసిన పదేళ్ళ కుర్రాడు అనూప్ ఇప్పుడు ఇరవై ఏళ్ళ యువకుడై తల్లి చితికి నిప్పంటిస్తున్నాడు. నేను మాత్రమే వెళ్ళి సింధుని చూశాను చివరిసారిగా.


శరత్ ఆటోలో నుండి ససేమిరా దిగనన్నాడు.

''నా దేవతని నా ఊహాల్లోనే ఉండిపోనివ్వరా ఆనంద్. నేనీస్థితిలో చూడలేను... నన్ను పిలవకు'' అంటూ నిర్వికారంగా తెగేసి చెప్పి ముఖం అటువైపుకి తిప్పుకున్నాడు శరత్.

అంతా అయిపోయింది.

సింధు రూపం పిడికెడు బూడిదగా మారిపోయింది. సింధు జీవితం ముగిసిపోయింది. సింధు వ్రాసే అద్భుతమైన కవితలు ఇక పత్రికల్లో కనిపించవు... ఇలా అనుకుంటే గుండె భారంగా మూలుగులోంది.

కానీ 'సింధు' జీవితం ఇలా అర్థాంతరంగా ముగిసిపోవడానికి కారణం తెలుసుకోవాలని నాకు బలంగా అన్పించింది.




## ఆదిపర్వం

అయిస్‌క్రీంను 1620లో ఫ్రాన్స్‌కు చెందిన గెరాల్డ్ టైసైస్ అనే వ్యక్తి మొట్టమొదటిసారిగా తయారుచేసాడు. మరి ఇక నుంచి అయిస్‌క్రీంను తినేముందు టైసైస్‌కు ఓసారి థాంక్స్ చెప్పండి!

మొట్టమొదటిసారిగా కదిలే బొమ్మల్ని ఫిల్మ్ మీదకు ఎక్కించిన ఘనత అమెరికాకు దక్కుతుంది! 1894లో మొదటి మోషన్ పిక్చర్ కాపీరైట్‌కు అప్లై చేసింది ఆ దేశంలోనే!

—జూపిటర్

సింధు వాళ్ళాయన్ని ప్రశ్నిద్దామంటే అతడు కృంగిపోయివున్నాడు.

కొడుకు సరేసరి కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నాడు. అందుకే అతడిని ఓదారుస్తోన్న ఓ వ్యక్తిని ప్రక్కకు పిలిచి విషయం తెలుపమని మర్యాదపూర్వకంగా కోరాను... అతడు సింధుకి ట్రీట్‌మెంటిచ్చిన డాక్టరు.

ఒక్క క్షణం నన్ను నిశితంగా పరిశీలించి చెప్పాడతడు.

''సింధుకి ఐ క్యాన్సర్... అదీ రెటీనాలో రావడంతో బ్లైండ్‌నెస్ వచ్చేసింది... ప్చ్ నిజంగా దురదృష్టం అనే చెప్పాలి... చివరి రోజుల్లో చాలా బాధపడిందా అమ్మాయి. చూపు తగ్గిపోవడంతో తీవ్రంగా కృంగిపోయింది.

ఆ డిప్రెషన్ ఆ అమ్మాయికాబట్టి తట్టుకుంది.

అటువంటి బాధ అగర్భశత్రువుకి కూడా వద్దు... కనుగుడ్డు పీకి ప్రక్కన పెట్టేద్దామన్నంత సలుపు... కంటినిండా ఇసుకపోసి కూరినట్లుగా... నిద్రపట్టదు. పట్టినా ప్రశాంతత ఉండదు... ఆ బాధ అనుభవించితేనే తప్ప ఒకరు చెప్తే తెలుసుకోలేనిది... అసలు సింధులాంటి అమ్మాయికి ఇది రావాల్సిన జబ్బుకాదు. మరే అనారోగ్యమైనా తట్టుకోవచ్చుగానీ ఈ మహమ్మారి జబ్బు మనిషిని కొంచెం కొంచెంగా పీక్కుతింటుంది... మరణం అనివార్యమని తెలుస్తూ ... తెలుస్తూ నిస్సహాయ స్థితిలో ఆత్మీయులు తల్లడిల్లిపోవడం... విపరీతమైన శారీరక బాధనీ, మెంటల్ డిప్రెషన్నీ అధిగమించి... సింధు అలా ఎలా వుండగలిగిందో తలచుకుంటే గుండె నీరయిపోతోంది. బాధగా ముగించాడతడు.

కంటినీళ్ళు తుడుచుకుంటూ సింధు భర్తవైపు చూశాను.

చేతిలో ఉన్న అమృతకలశాన్ని జారవిడుచుకుని నేలపాలైన అమృతంకోసం తీవ్ర వ్యధ పొందుతున్నట్లుగా వుందాతడి పరిస్థితి.

''ఆ అమ్మాయి వుండి బాధలనుభవించడం కన్నా వెళ్ళిపోయి మన మనసుల్లో శాశ్వతంగా నిల్చిపోయింది... మీరు బాధపడ్తోంటే సింధు చూడలేదు... మీరు సంతోషంగా ఉన్నట్లయితేనే సింధు ఆత్మశాంతిస్తుంది'' ఎవరో ఒక వృద్ధుడు డాక్టర్‌గారిని ఓదారుస్తున్నాడు.

నేను తేరుకుని చూసేటప్పటికి శరత్ స్పృహలో లేదు.

కొంచెం ఉపచారాలు చేసిన తర్వాత వాడికి స్పృహ వచ్చింది కానీ

వాడు మన స్పృహలో లేడు. వెర్రిగా నావైపు చూసి నవ్వుతున్నాడు.

పిచ్చివాడైన శరత్‌నీ, భారమైన నా హృదయాన్నీ మోసుకుంటూ రైలు తూర్పు దిక్కుగా సాగిపోతోంది.

కాలం చేస్తూన్న ఇంద్రజాలంలో నిశ్శబ్దంగా జారిపోతోన్న సంఘటనలను సమీకరిస్తూ శరత్ భవిష్యత్తుని తలచుకుని మౌనంగా రోదిస్తున్నాను నేను.